# సంపాదన

సదానందానికి జ్యోతిషం మీద నమ్మకం ఎక్కువ. అతను జాతకాలను బాగా నమ్ముతాడు. అతని బంధువర్గంలో ఒకాయన జాతకాలు గీసి భవిష్యత్తును చెప్పేవాడు. ఆయనే సదానందం ఇంకో ఏడాదికి పుడతాడనగా అతని అన్నయ్య విశ్వనాథం జాతకచక్రం గీసి అతను నలభైయేళ్ళు దాటుతున్నప్పుడు ఒక యాక్సిడెంటులో చనిపోతాడని చెప్పాడు. ఈ విషయాన్ని ఎవరూ నమ్మలేదు.

కానీ వూహించని విధంగా విశ్వనాధానికి నలభైయేడు దాటుతుండగా ఎక్కడినించో స్నేహితుడి మోటారుసైకిలు మీద వస్తున్నప్పుడు ఎదురుగా వస్తున్న లారీ గుద్ది స్నేహితుడితోపాటు విశ్వనాథం కూడా చనిపోయాడు. అప్పుడు సదానందానికి ముప్పయినాలుగేళ్లు.

ఈ సంఘటన జరిగిన తర్వాత సదానందానికి జాతకాల మీద నమ్మకం, విశ్వాసం బాగా పెరిగాయి. అందువల్లనే ఎవరయినా జ్యోతిషశాస్త్ర పండితుడి గురించి తెలిసినప్పుడు ఆయన దగ్గర తన జాతకచక్రం గీయించి తన భవిష్యత్తును తెలుసుకోవడం మొదలుపెట్టాడు.

ఇప్పుడు సదానందానికి యాభైయేళ్లు. అతను ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒకసారి సదానందం తన మిత్రుడు ఈశ్వర్‌తో కలిసి అతని పెద్ద కూతురి పెళ్లి సంబంధం గురించి గుంటూరు వెళ్లాడు. వాళ్లిద్దరూ రోడ్డుమీద వెళుతున్నప్పుడు రోడ్డు పక్కగా ఒక పెంకుటింటి ముందు ఏదో పేరుతో జ్యోతిషాలయం అనే బోర్డు కనిపించింది. వచ్చిన పని చూసుకుని తిరిగి వెళుతూ ఈ జ్యోతిషాలయ సిద్ధాంతిని కలవాలని అనుకున్నాడు సదానందం.

సదానందం తను కలవాల్సిన మనిషిని కలిసి కావలసిన వివరాలు తెలుసుకున్నాడు. తర్వాత ఈశ్వర్‌తో భోజనంవేళ కావడంతో అక్కడకు దగ్గరలో వున్న హొటల్లో భోజనం ముగించి వెనక్కు మళ్లాడు.

తిరిగివస్తూ ఆ రోడ్డు పక్కనే వున్న జ్యోతిషాలయం ఇంటి ముందు ఆగి ఓసారి ఆ ఇంటిని చూశాడు.

చాలా పురాతనమయిన పెంకుటిల్లు. చెక్కగేటు ఎదురుగా నిలబడితే లోపలి హాలు, గోడ పక్కగా చెక్కటేబులు, దాని వెనుక కుర్చీలో కూర్చుని ఏదో రాసుకుంటున్న ముసలాయినా స్పష్టంగా కనిపించారు.

“నా భవిష్యత్తు మరోసారి తెలుసుకోవాలని వుంది” అన్నాడు సదానందం.

ఈశ్వర్ నవ్వి "అలవాటేగా.... పద" అన్నాడు సదానందం గురించి తెలుసు కాబట్టి.

చెక్కగేటు నెట్టుకుని ఇద్దరూ లోపలకు వెళ్లారు.

ఆయన పేరు సోమనాథ సిద్ధాంతి అని బోర్డు మీద రాసి వుంది.

ఇద్దరూ నమస్కారం చేసి టేబులు పక్కనే వున్న కొంచెం పొడవాటి చెక్కబెంచీ మీద కూర్చున్నారు.

సోమనాథ సిద్ధాంతి నవ్వి "ఇద్దరి జాతకచక్రాలు వెయ్యాలా?" అని అడిగాడు.

అప్పుడు సదానందం "నా పేరు సదానందం. ఒక పనిమీద విజయవాడ నించి వచ్చాము. ఇతను నా మిత్రుడు విశ్వనాథం. నా ఒక్కడి జాతకచక్రం వేస్తే సరిపోతుంది. ఇంతకీ మీరు ఫీజు ఎంత తీసుకుంటారు?" అనడిగాడు.

"ఎక్కువ తీసుకోను. వంద రూపాయలు తీసుకుంటాను. వివరాలు చెప్పండి" అన్నాడు సిద్ధాంతి.

అప్పుడు సదానందం తను పుట్టిన తేదీ ఇంకా అవసరమయిన ఇతర వివరాలు చెప్పాడు.

సిద్ధాంతి వందేళ్లనాటి పంచాగాన్ని టేబుల్ సొరుగులోంచి బయటకు లాగి పేజీలు తిప్పడం మొదలుపెట్టాడు.

హాల్లో చివర యాభైయేళ్లు దాటిన విధవ స్త్రీ విస్తళ్లు కుడుతోంది. ఆమెకు కొంచెం దూరంతో పాతికేళ్ల వయసున్న ఓ అమ్మాయి పడకకుర్చీలో వెనక్కు వాలి ఏదో పుస్తకాన్ని చదువుతోంది. ఇంకా పెళ్లయిన సూచనలు ఏవీ లేవు.

క్యూరియస్‌గా వాళ్లిద్దరి గురించి అడిగాడు సదానందం.

సోమనాథ సిద్ధాంతి తను కాయితంమీద వేస్తున్న లెక్కలను ఆపి "ఆ విధవ నా కూతురు. పెళ్లయిన ఇరవైయేళ్లకే నా అల్లుడు పోయాడు. తల చెడి పుట్టింటికి చేరింది. అప్పటికే దానికి ఒక ఆడపిల్ల. ఆ అమ్మాయి అదే. నా మనవరాలు. ఈమధ్యనే నా భార్య గతించింది. ఇప్పుడు నాకు రెండు తక్కువ ఎనభైయేళ్లు. వాళ్లకు నేనే దిక్కు. నాకు వాళ్లు దిక్కు. నా మనవరాలి పెళ్లి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. సంబంధాలు వస్తున్నాయి గానీ కట్నం దగ్గర చెడిపోతున్నాయి. నాకు మగపిల్లలు లేరు. ఇద్దరూ ఆడపిల్లలే. ఈ ఇల్లు కూడా నాది కాదు. అద్దె ఇల్లు. ఎప్పుడు పడిపోతుందో తెలీదు. అద్దె తక్కువని వుంటున్నాము" అంటూ

నవ్వాడు. “ఇంతకీ భోజనం చేశారా?” సదానందం అడిగాడు.

“గంట క్రితమే చేశాను”

“భోజనం చేసి కొంచెంసేపు విశ్రమించరా?” మళ్లీ అడిగాడు.

“విశ్రాంతి తీసుకుంటూవుంటే సంపాదన ఎలా వుంటుందీ? మీవల్ల వచ్చే వంద రూపాయలూ రావు గదా?” అన్నాడాయన.

తర్వాత ఎవ్వరూ మాట్లాడలేదు.

కొంచెంసేపటికి సోమనాథ సిద్ధాంతి సదానందం జాతకచక్రం గీసి అతడి గురించి చెప్పడం మొదలుపెట్టాడు.

సదానందానికి ఇద్దరు మగపిల్లలనీ, భార్యవైపునించి కొంత ఆస్తి కలిసివచ్చిందనీ, ఇద్దరి పిల్లలూ బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థితిలో వుంటారనీ, సదానందం తరచూ అనారోగ్యంతో బాధపడుతూ వుంటాడనీ చెప్పాడు.

ఆయనలా చెబుతున్నప్పుడు సదానందం పక్కనే కూర్చున్న ఈశ్వర్ ఏదో మాట్లాడబోయాడు. కానీ సదానందం అతడి ప్రయత్నాన్ని వారించాడు.

అంతా చెప్పిన తర్వాత “అయ్యా.... మిమ్మల్ని కలిసినందుకూ చాలా సంతోషంగా వుంది. అంతా కరెక్టుగా చెప్పారు. మీ ఫీజు తీసుకోండి” అని పర్సు తీసి రెండు వందల రూపాయలు ఆయన చేతికిస్తూ “మీ శాస్త్ర పాండిత్యానికి ఇంకో వంద రూపాయలు అదనంగా ఇస్తున్నాను. స్వీకరించండి” అని ఆయనకు నమస్కారం చేసి ఈశ్వర్‌తో కలిసి బయటకు వచ్చాడు.

నిజానికి సదానందానికి ఇద్దరు మగపిల్లలు కాదు. ఇద్దరూ ఆడపిల్లలే.

“ఆయన అన్నీ అబద్ధాలు చెబితే రెండొందలు ఎందుకు ఇచ్చావ్?” అనడిగాడు ఆశ్చర్యంతో ఈశ్వర్.

అప్పుడు సదానందం నవ్వి “ఎనభైయేళ్ల వయసులో భోజనం చేసి ఒక గంట కూడా విశ్రాంతి తీసుకోకుండా డబ్బు సంపాదనపట్ల ఆయన పడుతున్న తాపత్రయాన్ని చూసి. బాధ్యతను నదుటిరాత మీదకు నెట్టివెయ్యకుండా మనవరాలి పెళ్లి బాధ్యతను నెరవేర్చడానికి ఆయన పడుతున్న శ్రమకు సహాయపడాలని రెండొందలు ఇచ్చాను. అంతేగానీ ఆయన చెప్పిన నా భవిష్యత్తుకు కాదు” అన్నాడు. ఈశ్వర్‌కు సదానందం కొత్తగా అగుపించాడు. ❖

*నవ్య వీక్లీ, 8-10-2008*